# " ప్రతిబింబాలు "

రచన :

" శార్వాణి "

ఆ ప్లాటుఫారమ్ మీద అంతకుముందే ట్రయిను వచ్చి వెళ్లిపోయింది. గమ్యస్థానాలను వెతుక్కుంటూ వచ్చిన జనాన్ని, రైలు బండి భరిస్తూ తీసుకొని వెళ్లిపోయింది. విశాలమైన పొడుగాటి ప్లాటు ఫారమ్ నిర్మానుష్యంగా వుండుట వల్ల బోసురు మంటోంది.

వేప మ్రాను నానుకొని బెడ్ హోల్డాల్ మీద కూర్చున్న నీరద తప్ప ఆ ప్లాటుఫారమ్ మీద ప్రయాణికు లెవరు కన్పించి నట్లులేదు. తాను వెదుకుతున్న గమ్యం ఎక్కడో తెలియలేదు. రెండు మూడు సార్లు బుకింగ్ దగ్గరకు రావడం, తిరిగి వెనక్కు వెళ్లి పోవడం జరిగింది. గార్డు పచ్చన జండా వూపినపుడు, బండి కూత కూసి, కదిలినపుడు కూడా, వెదుక్కుంటున్న గమ్యం చిక్కనేలేదు. పూర్తిగా ఆలోచనలో పడిపోయింది.

"జీవితపు విలువలను గ్రహించి ఉత్తమంగా బ్రతకడంలో నీతిని కాపాడటం జరుగుతుంది" మంచిని వెతుక్కుంటున్న ఆమె హృదయం, ఏదో బాధతో మూల్గుతూనే వుంది. ధర్మాన్ని కోరుకుంటున్న ఆమె మనస్సు ధర్మానికి దూరమై పోతున్నానేమోనని నిరాశ పడుతూనే వుంది. నీతి నియమాల్లో నిలవాలని వువ్విళ్లూరుతున్న ఆమె సౌశీల్యం దారి తప్పి బొమ్మ జెముడు ముళ్ల మధ్య యిరుక్కుంటుందేమో అని నిర్వేదిస్తూనే వుంది.

మంచిగా బతకాలి! ధర్మాన్ని కాపాడాలి!! నీతిని నిలబెట్టాలి.!!!

"మనం పుట్టింది దీని కోసమే! దీని కోసమే బ్రతకాలి. దీనితోనే చావాలి." నీరద తల్లి తన జీవితానుభవాన్ని వెళ్ల బోసినపుడు నీరదకు వళ్లు మండి పోయింది. ...."నీతిని నాశనం చేయుటకోసం పుట్టామా అమ్మా నా మార్గానికి అడ్డుగా నిలబడకండి."

"నీ చెల్లెలు నల్గుర్నీ మెప్పించి ఎంత డబ్బు గడిస్తూందో చూడు?"

అన్నెముపున్నెము తెలియని కన్నె హృదయానికి చిల్లులు పొడుస్తోంది అమ్మ. నా గుండెలో కూడ దూరి నాశనం చేయాలని చూస్తోంది అమ్మ.

"ఇది మన వృత్తి, మానవులు మారినా, తరాలు తరలినా, మన వృత్తులు మనతోనే వస్తాయి. వద్దని దూరంగా తప్పుకొని పారిపోతున్నా, అవి వెంబడిస్తునే వుంటాయి." అమ్మ హితబోధ. నీచాతి నీచంగా బ్రతకడం వృత్తా?దొంగతనం చేయడం, ఖూనీలు చేయడం, శీలాన్ని అమ్ముకోవడం, ఇవన్నీ వృత్తులేనా?సంస్కృతిని, నాగరికతను, ధర్మాన్ని, నీతిని మంట గలిపే వృత్తులకు నివృత్తిలేదా ?
పునర్జన్మ సిద్ధించదా?

అమ్మ మభ్య పెట్టింది. మనస్సును మార్చి మచ్చిక చేసుకోవాలని నానా తంటాలు పడింది.

"నా కోసం పడి చచ్చేవాడు, నన్ను లక్షణంగా పెళ్లి చేసుకొని, ధర్మంగా బ్రతకడానికి ఎందుకు వెనుకాడాలి?"

నా ప్రశ్నవిని అమ్మ ఖంగుమని నవ్వింది

"లక్షాధికారి పెళ్లి ఎప్పుడో అయిపోయింది?"

"అయితే నా కోసం ఎందుకు రావడం?"

"మన వంశాన్ని నిలబెట్టడానికి. మనం నాల్గు కాలాలు బ్రతకడానికి" జీవితాలను శరీరాలను అమ్మగా వచ్చిన డబ్బుతో విలువ కట్టే అమ్మకు నీతి నిజాయితీ ఎట్లా అర్థ మవుతుంది?

"నా గొంతులో ప్రాణం వుండగా వొప్పుకోను, నీ కెంతో పుణ్యంవుంటుంది. నన్నైనా నీతిగా బ్రతకనివ్వు."

అమ్మ కాళ్ల మీద పడి ఏడ్చాను, ప్రతిఫలం గదిలో పడేసి బయట గొళ్లెం పెట్టివెళ్ళింది,

ప్రక్కగదిలో నుంచి నవ్వులు. చెల్లి !

పదహారు వసంతాలు పూర్తిగా నిండలేదు. డబ్బు

కోసం మంచిని మరచి పోయింది. మెరుగులు చూపించి ప్రపంచాన్ని మోసంచేస్తోంది. అమ్మ చెప్పిన పాఠాలు నెమరువేసు కుంటూ, ఇంటిని నరకకూపంగా చేస్తోంది. మరి తనో? పతిత కాకూడదు. పతివ్రత కావాలి.

గది తలుపులు తెరచిన శబ్దం విన్పించేసరికి, వులిక్కి పడి వెనక్కి తిరిగి చూస్తే, భయంకరమైనరూపం.

లోతుకుపోయి ఎర్ర జీరలు పడ్డ చారడేసి కళ్లు, నా కళ్లలోకి భయంకరంగా చూచాయి, ఆకృతి తూలుతూ తూగుతూ మంచంమీద పడింది. ఆకృతి. గట్టిగా నవ్వాడు. గదిలోని ప్రతివస్తువు వణికి పోయింది. నోరు పెద్దగా తెరచుకొని ఆవులించాడు.

కోటు జేబులోనుంచి. రెండు చేతులు పోనిచ్చి, రెండు నోటు కట్టలను తీశాడు.

ఆ కురూపికి పవిత్రమైన యవ్వనాన్ని ఆ రాక్షసికి విలువైన శీలాన్ని అంకితంచేయాలా????? నీతి అంగీ కరిస్తుందా? ధర్మం వొప్పుకుంటుందా? జాతి వూరు కుంటుందా? డబ్బు చూపించాడు. నవ్వలేక నవ్వాడు. ఆ దయ్యం దగ్గరకు రాబోతే ఒక్క తోపు తోసేసరికి కుప్పగా నేలమీద పడ్డాడు.

వళ్లు దులుపుకుంటూ, మళ్లా వెనక్కి తిరిగి చూడ కుండా నిష్క్రమించాడు. అదృష్టవశాత్తూ బ్రతికిపోయాను. అర్జంటుగా అమ్మ బెజవాడ వెళ్లవలసి వచ్చింది. చెల్లె మ్మను ఏమార్చి వచ్చేశాను,

చెక్కిళ్ల మీద జాలువారుతున్న కన్నీటిని తుడుచు కుంటూ, బరువుగా నిట్టూర్చింది నీరద.

* * *

ప్లాటు ఫారము చివర భాగం నుంచి తొందర పడుతూ వస్తున్న వెంకట్రావు నిర్మానుష్యంగా వున్న స్టేషను చూచి కంగారు పడ్డాడు. చెట్టు క్రింద నీరద కన్పించింది.

"ట్రయినింకా రాలేదా?" సమాధానం కోసం చూడ కుండానే, ముందుకు నడిచి వెళ్లాడు. తిరిగి వచ్చి ఆమెకు సమీపంలో నించున్నాడు.

"బండి వెళ్లి పోయి వుంటుంది" గొణుక్కుంటూ అతడు స్టేషనులోనికి వెళ్లి, బండి వెళ్లినట్లు నిర్ధారణ చేసుకున్నాడు. నిస్పృహతో వేపచెట్టు దగ్గరకు వచ్చాడు. నీరద తల వంచుకొని కూర్చుంది.

"పిన్ని అనుకున్నంత పని చేస్తుంది." బాధతో మూల్గుతున్న కళ్లు, అద్దాల్లో నుంచి బరువుగా మూల్గు తున్నాయి. నీరద తలపైకెత్తి చూచింది. ముఖం మీద పడుతున్న వెంట్రుకలు అతని ముఖంలో వ్యక్తమయే ఆవేదనను కొంచెం కూడ దాచలేక పోతున్నాయి. నీరద అతనివేపు పరీక్షగా చూచింది.

"పిన్ని ఆస్తంతా దగ్గరుండి వ్రాయించేసు కుంటుంది. ఆశలన్ని నిరాశలయాయి."

జరిగిపోయిన కష్టాలను విస్మరించి, జరగబోయే బాధల గురించి, అతని హృదయం క్షోభతో కుమిలి పోతోంది.

సులభంగా ప్రసవించిందని డాక్టరు చెప్పాడు. వంట రిగా బల్ల మీద విచారంగా కూర్చున్న నాన్న హృదయం గతుక్కు మంది.

లోపల అమ్మ కడుపు కోశారు,
కళ్లు మూతలు పడేవున్నాయి. బిడ్డ మెల్ల మెల్లగా చిన్ని కళ్ళను విప్పుతున్నాడు. మానవుడుగా ప్రపంచంలోనికి రాబోతున్నాడు. అమ్మ మెల్లగా కళ్లు తెరచి చూచింది. ప్రక్కనున్న బిడ్డను చూచి మురిసి పోయింది ముమ్మూర్తులా నాన్న పోలికేనని మరీ సంతోషించింది. అమ్మ మృదువుగా పాప వంటి మీద చేయివేసి బుజ్జ గించి, లాలించి లేత బుగ్గల మీద ముద్దిడాలని తహ తహలాడి పోయింది. చేయి కదలలేదు. పాప ఏడ్చాడు. అమ్మ, మొదటి సారిగా పాపకు పాలివ్వాలని కుతూహల పడింది, లేచే ఓపికలేదు.

అమ్మ ఏదో అనబోయింది, అమ్మ ముఖం మీదకు వంగి నాన్న వినబోయేడు, కంఠంలో మాట కంఠంలోనే విలీనమయిపోయింది.

"బిడ్డ దక్కింది!" అదే కావాలి. కాబట్టి. తన ప్రాణం పోయినా ఫర్వాలేదనుకుంది. బిడ్డను దక్కించు కున్నందుకు సంబర పడిపోయింది.

అమ్మను బ్రతికించడానికి డాక్టరు శాయశక్తులా ప్రయత్నం చేశాడు. కాని అంతా బూడిదతో పోసిన పన్నీరు.

శాశ్వతంగా కళ్లు మూసింది.

"అమ్మా!"

గట్టిగా అరిచాడు వెంకట్రావు.

నీరద వులిక్కిపడి అతని వంక చూచింది.

అతని కళ్లు చెమ్మగిల్లాయి. బాధతో విషాదిస్తున్నాయి.

"అమృత మూర్తి అమ్మ. అమరజీవి అమ్మ!" నా కోసం అమ్మ తన నిండు ప్రాణాన్ని ధారబోసింది. భగవంతుడు నా ప్రాణాన్ని తీసుకొని. అమ్మనెందుకు బ్రతికించ కూడదు? అమ్మ అందుకు ఒప్పుకోలేదు. నన్ను బ్రతికించ మని ఎన్నో దేవుళ్లకు మొక్కుకుంది."

వెంకట్రావు మాటలు నీరదకి విన్పించక పోయినా నీరద బరువుగా నిట్టూర్చింది.

వెంకట్రావు కమీజుతో కన్నీళ్ళు తుడుచుకొని, నవ్వును తెచ్చుకొని, తనలో తాను నవ్వుకుంటున్నాడు.

నీరదకు అర్థం కాలేదు. ఆ నవ్వులో భావాన్ని అందుకో లేక పోయింది. అతడు చూస్తున్న నక్షత్రం వంక తను కూడా చూస్తోంది. ఇద్దరి చూపుల్లో ఒకటే భావం తొణికిస లాడింది.

"అమ్మ మరణించిన సంవత్సరంతిరగ కుండానే నాన్న మరో వివాహం చేసుకున్నాడు. తన వినోదాలకు విలాసాలకు అడ్డని నన్ను అమ్మమ్మదగ్గర వదిలి పెట్టి వెళ్లిపోయాడు. అమ్మమ్మ వృద్ధాప్యం దాపరించి పరలోకానికి వెళ్లి పోయింది. నాన్న దగ్గరకు వెళ్లితే నాన్న దర్శనం కానీయకుండా చేసింది పిన్ని. నా మీద పిన్నికి దయరాలేదు."

* * *

కాళ్లీడ్చు కుంటూ, పంపు దగ్గరకు వెళ్లాడు. పంపు తిప్పాడు. విసిగెత్తి చివరకు విచార వదనంతో ఇసికమీద వచ్చి చతికిల పడ్డాడు. దాహం బాగా వేస్తోంది. నాలుక పిడచ కట్టుకు పోతోంది. వత్తిగిలి, ఎంత బలవంతంగా కళ్ళు మూసినా నిద్ర పట్టలేదు. అటూ ఇటూ ఇసిక మీద దొర్లుతున్నాడు.

మరచెంబులో వున్న నీళ్లను, గ్లాసులో పోసి, అతని దగ్గరకు వచ్చి నిలబడ్డ నీరదను గమనించి, వెంకట్రావు లేచి కూర్చున్నాడు. గ్లాసునేల మీద పెట్టి, నీరద మరి యొక వైపుకి మొహం పెట్టింది. గబగబా మంచి నీళ్ళు గొంతులో పోసి, ఖాళీ చేసిన గ్లాసునునేల మీద వుంచాడు.

ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. ఇద్దరకీ ఏమి మాట్లాడాలో తెలియలేదు.

ఇద్దరూ బాధ పడుతున్నారని ఎవరికి వాళ్లకే తెలుసు. బాధను వ్యక్తం చేయడం మాత్రం ఏవరు నేర్చుకోలేదు.

ఘడియలు గంటలు దొర్లి పోతున్నాయి. ప్లాటు ఫారము మీదా జనం నిండు కుంటున్నారు. తెల్లవారు ఝామున వచ్చే బండికి, జనం ఎదురు చూస్తున్నారు. వెంకట్రావు లేచి నిలబడి. నీరద దగ్గరకు వచ్చాడు. నీరద వేపచెట్టు నానుకొని నిద్ర పోతోంది. చెరగని కన్నీటి మరకలు పసిమి బుగ్గలపై స్పష్టంగా కన్పించాయి

స్టేషనులో గంటలు మ్రోగాయి. నిద్ర పోతున్న నీరద త్రుళ్లి పడి, కళ్ళు తెరచి, చూచింది. "బండి వచ్చే వేళయింది" మెల్లగా అన్నాడు "ఎక్కడకు వెళ్లాలి?" తనలో తాను సతమత మవుతున్న నీరద ప్రశ్నకు సమాధానం దొరకలేదు.

"టిక్కట్టు తీసుకొని రమ్మంటారా?" "ఏ ఊరికి"

దానికి సమాధానం రాలేదు. ఆమె నుండి జవాబు లేక పోవడం. వెంకట్రావు మనస్సు చివుక్కు మంది.

"చూడండి!" సన్నగా విన్పించేసరికి, వెళ్తూన్న వెంకట్రావు వెనక్కు తిరిగి వచ్చాడు.

"మీరేవూరు వెళ్తున్నారు?" "పాల కొల్లు."

"ఆ ఊరువెళ్తే మీ మనస్సులో పీడిస్తున్న బాధలన్నీ తొలగి పోతాయా?" అతనికెటువంటి సమాధాన మివ్వాలో అర్థం కాలేదు, తను బాధ పడుతున్నట్లు ఆమె గ్రహించి వుందని తెలుసుకున్నాడు.

"మీరు ఏవూరు వెళ్లాలి?" ఆమె అడిగిన దానికి తిన్నగా సమాధానం చెప్పక, మరొక ప్రశ్నవేశాడు.

"అంతా అగమ్య గోచరంగా వుంది."

ట్రయిను కూత విన్పించింది. "బండి వచ్చేస్తూంది." వెంకట్రావు తొందర పెట్టాడు. నీరద పర్సులో ఐదు రూపాయలు నోటుతీసి అతని చేతిలో పెట్టి, "పాల కొల్లు ఒక టికట్టుతీసుకోండి"అని గబుక్కున అనేసింది.

ప్రతి బింబాల్లా, నీరద వెంకట్రావులతో రైలు బండి కదిలింది.